www.vastavam.in

# వాస్తవం.ఇన్

డిజిటల్ పత్రిక

ఎడిటర్: దండుగుల శ్రీనివాస్

News you can trust

| మంగళవారం | 25-03-2025 |

# ఎంపీలకు భారీగా పెరిగిన వేతనాలు

**కనీసం నెలకు లక్ష పెంచిన కేంద్రం**

**ఎంపీల పెన్షన్ కూడా భారీగా పెంపు**



**వాస్తవం, న్యూఢిల్లీ:**

పార్లమెంటు సభ్యుల వేతనాలను భారీగా పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాగే రోజువారీ భత్యాలను, ఎంపిల పెన్షన్లు కూడా భారీగానే పెంచారు. ఈ మేరకు నోటిఫికేసన్ విడుదలయ్యింది. ఇప్పటికే ఎంపిల జీతభత్యాలపై విమర్శలు వస్తున్నా మరోమారు జీతాలను పెంచడం విశేషం. ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఎంపీల జీతాన్ని దాదాపు 24శాతం మేర పెంచారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది.

అలాగే ప్రతి నెలా అందే వేతనాలు, పెన్షన్లును కూడా కేంద్రం పెంచింది. దీంతో ఒక్కో ఎంపీ వేతనం నెలకు రూ.లక్ష నుంచి రూ.1.24లక్షలకు పెరగనుంది. సిట్టింగ్ సభ్యుల రోజువారీ భత్యాన్ని రూ.2వేల నుంచి 2,500కు పెంచుతున్నట్లు అందులో పేర్కొంది. మాజీ పార్లమెంటు– సభ్యులకు ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్‌ను రూ.25వేల నుంచి రూ.31వేలకు పెంచుతున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పెంచిన ఈ వేతనాలను 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తింపజేస్తున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చులను దృష్టిలో పెట్టుకని ఈ పెంపును వర్తింప చేశారు.



# ఇన్ సరే...! ఔట్ ఎవరు..??

**ఎట్టకేలకు ఊరిస్తూ ఊరిస్తూ కేబినెట్ విస్తరణకు ఓకే చెప్పింది కాంగ్రెస్ అధిష్టానం. ఎప్పుడెప్పుడా అని అంతా ఎదురుచూస్తున్న తరుణం రానే వచ్చింది. ఉగాది తరువాత కేబినెట్ విస్తరణ ఉంటుంది. నలుగురికి చాన్స్ లభించింది. మరో ఇద్దరి పేర్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే రెడ్లు ఎక్కువయ్యారనుకుంటే.. సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లకు చాన్స్ ఇచ్చింది అధిష్టానం. ఎస్సీ కోటా నుంచి వీ 6 వివేక్‌కు, బీసీ కోటా నుంచి శ్రీహరి ముదిరాజ్‌పేర్లు ఫైనల్ చేసింది. ఇది అందరికీ తెలిసిన వార్తే. శాఖల్లో కూడా భారీ మార్పులుంటాయనీ తెలుసు. కానీ ఒకరి కేబినెట్ నుంచి తొలగిస్తారని జరుగుతున్న ప్రచారం ఇప్పుడింకా బలపడింది. ఇదిప్పుడు హాట్ వార్తగా మారింది.**

**కేబినెట్ నుంచి ఒకరి ఉద్వాసన...!**

**కొండా నా..? జూపల్లి నా..??**

**నలుగురికి కొత్తగా చాన్స్....!**


**ఇందులో ఇద్దరూ రెడ్లే...**

**సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల పేర్లు ఖరారు..**

**బీసీ నుంచి శ్రీహరి ముదిరాజ్, ఎస్సీ నుంచి వివేక్...!**

(దండుగుల శ్రీనివాస్)

ఎవరిని తొలగిస్తారు..? ముందు నుంచి ప్రచారం జరుగుతున్నట్టుగా కొండా సురేఖనా..? జూపల్లి కృష్ణారావునా..?? తేలాల్సి ఉంది. వీరిద్దరూ సీఎం రేవంత్‌కు దగ్గరే అనే పేరుంది. కానీ ఇద్దరిలో ఎవరో ఒకరు ఔట్ కాకతప్పదు. ఎవరిపై వేటు పడుతుందనే విషయాన్ని సామాజిక కోణం దృష్టితో ఆలోచిస్తే... కొండా సురేఖ సేఫేనని చెప్పాలి. ఎందుకంటే.. కొండా పద్మాశాలి. ఆమె భర్త మున్నూరుకాపు. ఈమెకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా రెండు మేజర్ కులాలకు ప్రాతినిధ్యం కల్పించినట్టయ్యింది ప్రభుత్వానికి. ఇదికాక మహిళా మంత్రిని తొలగించాలనే ఆలోచన అంత ఈజీగా చేయరు. ఇవన్నీ ఆమెకు కలిసి వచ్చే అంశాలే. మరి జూపల్లిని తొలగిస్తే...?? అసలు ఎందుకు తొలగిస్తారు..?? ఆ మధ్య సీఎం కేటీఆర్ అని సంభోదించి ఇరుకున పడ్డాడు జూపల్లి. కేటీఆర్ కూడా దీనిపై స్పందించి ఇక నీ మంత్రి పదవికి గండం ఉంది చూసుకో జర జాగ్రత్త అని కామెంట్ చేశాడు. ఇదొక్కటే కారణం కాకపోయినా.. మొదటి నుంచి సర్కార్ దృష్టిలో నెగిటివ్ కోణంలో ఉన్న వారిలో జూపల్లి ఒకడు. కొండాను కాదంటే జూపల్లి బలి కావాల్సిందే. జూపల్లి ప్లేస్ ఎవరికిస్తారు...? వెలమ సామాజిక వర్గానికి చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా లీడర్ ప్రేమ్‌సాగర్‌కు ఇవ్వొచ్చు. లేదంటే రెడ్ల లో ఒకరికే ఇవ్వాలి.. అదీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికే ఇవ్వాలని అనుకుంటే సుదర్శన్‌రెడ్డికి కట్ చేసి ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎల్లారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న మదన్‌మోహన్‌కు కూడా ఇవ్వొచ్చు. మదన్ మోహన్ కన్నా... ప్రేమ్ సాగర్‌కే కాంగ్రెస్ పార్టీ ఎక్కువ మొగ్గు చూపే అవకాశాలున్నాయి. ఇదే జరిగితే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కు మంత్రే లేకుండా పోతాడు. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లా వాసే అయినందున...? అతనికి కొరకరాని కొయ్యగా ఉన్న సుదర్శన్‌రెడ్డికి ఇవ్వకుండా ఆపేస్తారా..? చూడాలి. కానీ సుదర్శన్‌రెడ్డికే కచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని సీఎం పట్టుబట్టాడు. దీని పై క్లారిటీ రానుంది.



# కదులుతున్న రైలులో.. మహిళా బోగీలో.. యువతిపై అత్యాచారయత్నం



**తప్పించుకునే క్రమంలో రైలునుంచి దూకిన యువతి**

**వాస్తవం హైదరాబాద్:**

ఎంఎంటిఎస్ రైలులో ఓ యువతిపై కామాంధుడు అత్యాచారం చేయడానికి ప్రయత్నించడంతో ఆమె రైలులో నుంచి బయటకు దూకడంతో తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన మేడ్చల్ జిల్లా అల్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన ఓ యువతి(23) మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. గత కొన్ని రోజుల నుంచి సెల్‌ఫోన్ పని చేయకపోవడంతో మరమ్మతు కోసం సికింద్రాబాద్‌కు వచ్చింది. సెల్‌ఫోన్ మరమ్మతు చేసుకొని సికింద్రాబాద్‌లో ఎంఎంటిఎస్‌లో మేడ్చల్‌కు బయలుదేరింది. మహిళల కోచ్‌లో ఆమె ఎక్కింది. బోగీలో ఉన్న ఇద్దరు మహిళలు అల్వాల్ దిగిపోవడంతో యువతి ఒంటరిగా ఉంది. ఇదే అదునుగా భావించిన ఓ యువకుడు ఆమెపై అత్యాచారం చేయడానికి ప్రయత్నించాడు. అతడి నుంచి తప్పించుకొనేందుకు ఆమె రైలు నుంచి కిందకు దూకింది. కొంపల్లి శివారులో రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆమె తీవ్రంగా గాయపడడం గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఎల్ఆర్ఎస్ ఆఫర్ ఈ నెలాఖరు దాకే..!

- నెలాఖరు వరకు 25శాతం రాయితీతో అమలు
- త్వరలోనే భూముల విలువ పెంపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

**వాస్తవం హైదరాబాద్:**

ఎల్ఆర్ఎస్ గడువు పొడగించే ఆలోచన లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్ఆర్ఎస్ పర్మిషన్ ఇప్పుడు కాకుండా ఇళ్ళు కట్టేటప్పుడు కావాలంటే అప్పుడు వందశాతం ఎల్ఆర్ఎస్ కట్టాల్సి ఉంటుందని అన్నారు. ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన మేర స్పందన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ స్కీమ్‌పై మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు చేశారు. ఎల్ఆర్ఎస్ స్కీమ్ గడువు మార్చ్ 31 వరకు ఉందని.. ఆలోపు చేసుకున్న వారికి 25 శాతం డిస్కౌంట్ ఇస్తున్నామని తెలిపారు. సోమవారం మీడియా ప్రతినిధులతో మంత్రి చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. త్వరలో భూవిలువలను పెంచబోతున్నామని తెలిపారు. త్వరలో భూ సర్వే కోసం ప్రతీ మండలానికి సర్వేయర్, డిప్యూటీ– సర్వేయర్‌ను నియమిస్తామని.. అలాగే లైసెన్డ్ సర్వేయర్‌లకు అవకాశం ఇస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 6 వేల మంది లైసెన్డ్ సర్వేయర్లు ఉన్నారని వీరికి శిక్షణ ఇచ్చి అవకాశం కల్పిస్తామన్నారు. సాదాబైనామాల విషయంలో కొత్త దరఖాస్తులను స్వీకరించమని తేల్చి చెప్పారు. పాత దరఖాస్తులలో 13 లక్షల అప్లికేషన్లను గత ప్రభుత్వం తరస్కరించిందని దరఖాస్తు తిరస్కరణకు గురైన వారు అప్పిలేట్ ఆథారిటిలో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. కేంద్రం ప్రధాని అవాస్ యోజన కింద అర్బన్ ఏరియాలో 1 లక్ష 13 వేల ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. అర్బన్ ఏరియాలో కట్టే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తుందని.. మిగతాది రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. రూరల్ ఏరియాకు సంబందించి కేంద్రం ఇంకా ఎలాంటి క్లారిటీ– ఇవ్వలేదని పేర్కొన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో విభేదాలు ఉన్నట్లు జరుగుతోన్న ప్రచారంపై మంత్రి పొంగులేటి స్పష్టత ఇచ్చారు. తనకు, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి మధ్య ఎలాంటి సమస్య లేదని చెప్పారు. అనిరుధ్ రెడ్డితోనే కాకుండా ఇతర ఏ ఎమ్మెల్యేతో కూడా విభేదాలు లేవని వివరణ ఇచ్చారు.



# ఆచరణసాధ్యంకాని హామీలివ్వొద్దు..!

- ఖజానా ఖాళీ చేస్తూ పోతున్నారు
- అసెంబ్లీలో గళమెత్తిన అక్బరుద్దీన్

**వాస్తవం హైదరాబాద్:**

ఆచరణసాధ్యమైన హామీలు ఇవ్వండి.. ఖజానా ఖాళీ చేస్తూ పోతే ఎలా అంటూ అసెంబ్లీలో అక్బద్దీన్ గళమెత్తారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ సభలో తన ప్రత్యేక శైలి లో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, అవి అమలయ్యే విధానం, ప్రజలకు అందే ప్రయోజనాలను ఉద్దేశించి ఆయన నేరుగా ప్రభుత్వ తీరును ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో ప్రసం గిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ, హైదరాబాద్‌లో ఉన్న ఇద్దరు ఫేకులు గురించి ఒక కథను వినిపించారు. ఈ కథ ప్రభుత్వాలు చేసే వాగ్దానాలను నమ్మే పరిస్థితి ఎంత అసాధా రణంగా మారిందో చెప్పారు. ప్రభుత్వాలు ప్రజలకు ఎన్నో హామీలు ఇస్తుంటాయి. అయితే, ఆ హామీలను నెరవేర్చడానికి అవసరమైన నిధులు లేవు. 'ఇది చేస్తాం, అది ఇస్తాం' అంటూ ప్రజలను విశ్వసిం పజేసేలా హామీలు ఇస్తూ, ఆర్థిక భారం పెంచుకుంటే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిపో తోందని ఆయన అన్నారు.

# స్థానిక సంస్థ ఎమ్మెల్సీ ఎన్నిక షెడ్యూల్ విడుదల

**వాస్తవం హైదరాబాద్:**



హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ పదవీ కాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 28న నోటిఫికేషన్ విడుదలకానుంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. అదే నెల 7న నామినేషన్లను పరిశీలించనున్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉంటుంది. అదే నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. 25న ఫలితాలు ప్రకటిస్తారు.